



"రాముడూ!"

పడక కుర్చీలో కూర్చుని కళ్ళద్దాలు సవరించుకుంటూ పిలిచారు విశ్వనాథంమాస్టారు. ఆయన ఆ ఊరిలో ఓ ఎలిమెంటరీ స్కూలుటీచరు. పది మంది పిల్లల వెనకగా బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాడు రాముడు. మాస్టారి పిలుపు వినబడేసరికి వాడికి ఒంటినిండా చిరుచెమటలు పోశాయి. భయంభయంగా మాస్టారివేపు చూస్తూ లేచి నించున్నాడు. పిల్లలంతా వాడివేపు చూస్తూ కూర్చున్నారు. ఒకరిద్దరి పెదవుల మీద వెక్కిరింతగా చిరునవ్వుకూడా మెదిలింది.

"ఏ రోజయినా ప్రైవేటుజీతం తెచ్చావా?"

దరిద్రంలో పుట్టి పెరుగుతున్న రాముడు, చిన్న వయస్సులోనే పెద్దగా ఆలోచించగలిగే రాముడు, మాస్టారి జీతం తెచ్చి ఇవ్వలేకపోయిన రాముడు మాస్టారికి జవాబు ఇవ్వలేదు.

"తేలేదా ... చెప్పు ...?" మాస్టారు గొంతు రెట్టించి అడిగారు. ఇలా ప్రశ్నిస్తున్న విశ్వనాథంగారి గొంతులో. . . తడబాటు ఉంది; ఆత్రత ఉంది, విచారం ఉంది.

"మా అయ్య. . . నాలుగు రోజులలో. . . ఇచ్చేస్తానన్నాడండి!" చివరికి ధైర్యం చేసి గొంతు పెగుల్చుకుని అన్నాడు రాముడు. అన్నాడేకాని, మాస్టారి నుంచి రాబోయే చివాట్లని తలుచుకున్నవాడికి కంపరం ఎత్తుతూంది.

రాముడి తండ్రిపేరు నరసయ్య. రైసుమిల్లులో పని. కొడుకుని బాగా పెద్ద చదువులు చదివించి వాడు పెద్ద ఉద్యోగం చేసుకుంటూ రాజాలాగా బతుకుతూఉంటే చూడాలని నరసయ్య కోరిక!

తనని తండ్రి అయిదో తరగతితోనే చదువు మాన్పించేశాడు. అప్పుడు తనకు చదువుకోవాలనే కోరిక ఎక్కువగా ఉండేది.

"ఎర్రినాగన్నా! నా మా టినుకోరా! డబ్బున్నోళ్ళకి, బాపనోళ్ళకి ఈ సదువులు కానీ. . . గంజినీళ్ళకి గతిలేని వోళ్ళం ... మన కీ షదువులెందుకురా? పిచ్చి మాలోకవా! సదువుకుంటామంటే మాతరం మనకి సదువులు అబ్బుతాయంరా? రేసుమిల్లు రాజారావుగారితో మాట్లాడేసినాను. నెలకి ఆరు రూపాయలు జీతం . . . రాజానాగా బతకొచ్చు! . . . పెందిలనే మిల్లు నంతా సీపు రబ్బుకుని ఊడవటమే!

రిచ్చాలు ఎందుకు నాగుకుని బతుకుతున్నారు? ముష్టోళ్ళు బిచ్చ మెత్తుకుంటూ ఎందుకు బతుకుతుండారు? రేలు టేసనుకాడ కూలీలు ఆ పని నెందుకు సేత్తుండారు? . . . ఎదవా, మనం బతికితే కూలిపని సేసుకునే బతకాలిరా! అళ్ళంతా సదివేసుకుని ఉద్యోగాలు సేయనేకనా! పేదోళ్ళు గొప్ప సదువులు సదువుకుంటామంటే అంతా నవ్వరూ? నే సెబుతుండా. . . నా మా టినుకోరా!"

తండ్రి తనని మోసం చేశాడని నరసయ్యకి పదహారో యేడు వచ్చేసరికే అర్థమయిపోయిందే! 'తననలా తండ్రి ఎందుకు మోసం చేయవలిసి వచ్చిందో'. . . ఇరవయ్యో యేట అడుగు పెట్టేవేళకి అవగాహన మయింది.

అప్పుడు తండ్రి చెప్పినదంతా తన తలలోకి బాగా ఎక్కింది. లోకంలో చదువుకోవటానికి అర్హత చాలా కొద్దిమందికి మాత్రమే ఉన్నట్టుగా భావించాడు. పైగా తండ్రి తనకొక ప్రలోభంకూడా చూపించాడు. నెలకి ఆరు రూపాయల జీతంతో రాజారావుగారి 'రేసుమిల్లు' లో ఉద్యోగం!

ఆరు రూపాయల జీతం ఆరు వందల జీతంలా కనిపించిందప్పుడు. రోజులు మారినా. . . ధరలు పెరిగినా. . . నరసయ్య జీతం మాత్రం మరో ఎనిమి

రూపాయల తేడాతో తప్ప మార్పు చెందలేదు.

అప్పుడు కేవలం మిల్లు అంతా ఊడవటమే తను చేయవలసిన పని. . . ఇప్పుడు. . .అంతా నేర్చుకుని మిషనుకూడా రోజూ రెండు పర్యాయాలు క్లీన్‌చేస్తూ ఉంటాడు! కాని. . . జీతం?. . .

అదంతే. . . అక్కడే మన అమోఘమయిన తెలివి తేటలున్నాయి. అహంభావం ఉంది. మనిషిని మనిషిగా గుర్తించలేని అనాగరికత ఉంది.

నరసయ్య తన జీతం గురించి ఎప్పుడూ రాజారావు గారిని గట్టిగా ప్రశ్నించలేదు. పేదవాడి కోపం పెదవికి చేటని అతనికి తెలుసు.

ఇలాంటి పరిస్థితులలోకూడా... తను తన తండ్రిచే దగా చేయబడిన విధంగా తన రాముడు అదే మోస గించ బడకూడదని దృఢంగా నిశ్చయించుకున్నాడు నరసయ్య.

తన పధ్నాలుగు రూపాయల జీతంతోను పొట్ట పోసుకుంటూ రాముణ్ణి చదివించటం నరసయ్యకి దుర్భరంగానే ఉంది. విశ్వనాథం మాస్టారి దగ్గిర నాలుగు రూపాయల జీతంతో ట్యూషనుకూడా పెట్టాడు. రైసుమిల్లులో పని కాగానే బస్సుస్టాండుకి వెళ్ళి బరువులు మోయటంకూడా ప్రారంభించాడు. తన కొక లక్ష్యం ఉన్నది. . . దాన్ని పొందటం కోసం ఎన్ని కష్టాలనయినా భరిస్తాడు తను!

విశ్వనాథంమాస్టారి ప్రైవేటుజీతం ఇచ్చివేయ టంలో నరసయ్య ఎప్పుడూ ఆలస్యం చేయలేదు. ముసలితల్లికి జబ్బు చేయటం. . . మందులు కొని పోయటంవల్ల డబ్బుకి ఖర్దుకోవటం చికాకయిపోయింది. మాస్టారి జీతం ఇవ్వలేకపోయాడు. రాముడు వచ్చి “మాస్టారికి జీతం ఇవ్వాలి, అయ్యా!” అన్నప్పుడు, “చూడు, రాముడూ! ముసిలానికి మందులు కొని పోశాను కదా! నాకలు కొనుక్కోక తప్పుదుకదా? ఈ నెలలో సొమ్ముకు కొంచెం చికాకు వొచ్చి పడింది. నాలుగు రోజులాగి పంతులుగారికి ఇస్తానని సెప్పు— ఏం?” అన్నాడు తను. పిచ్చిరాముడు, తన ఇబ్బందుల్ని ఇంత చిన్నవయసులోనే ఎంత బాగా అర్థం చేసుకున్నాడు? మళ్ళీ తనని జీతం గురించి అడగనే లేదు!

మాస్టారి కనుబొమలు చికాకుగా ముడిపడ్డాయి. అతని కా క్షణంలో తన పరిస్థితులుకూడా గుర్తు వచ్చాయి. అతనికి అసహనంతో పిచ్చికోపం వచ్చింది.

“ఇలా రోజుకి రోజూ వాయిదాలు వేస్తూ దాటేం చేస్తూ ఉంటే ఎలా చెప్పు, రాముడూ? నా ఇబ్బందు లేవో నాకూ ఉంటాయిగా? మిగతా అందరూ ఇచ్చేశారప్పుడే. . . నువ్వొక్కడివే ఇంకా ఇవ్వాలి. రేపు తప్పకుండా తెచ్చిఇవ్వాలి. . . లేకపోతే. . . అంగీకరించేది లేదు. . . సుమా!” చివరి మాట అంటున్నప్పుడు విశ్వనాథంగారి గొంతు కొంచెం తడబడింది. మాట అతని మనసులోనుంచి రాలేదు.

మాస్టారి మాటలు విన్న రాముడి ముఖం తెల్లగా పాలిపోయింది. దుఃఖం గొంతు దగ్గిరికి వచ్చి నిలిచి పోయింది. చివరికి అతికష్టంమీద గొంతు పెగుల్చుకుని “అలాగే. . . మాస్టారూ” అన్నాడు.

మారిపోయిన రాముడి ముఖభంగిమలు చూసి విశ్వనాథంగారి మనసు చివుక్కుమంది.

ఆయన బరువుగా నిట్టూర్చారు.

*కలవారికి లేనివారి బాధలు తెలియవు. వారి అవసరాలు, కన్నీళ్ళు గుర్తించలేరు. కష్టాలలో ఉన్న పేదవాడు తాత్కాలికంగా ఉద్రేకం పొందినా, సాటివాని ఆవేదన చూచి ఉపశమనం పొందుతాడు. అరచేతిలో పైస కనిపించగానే బిచ్చగాని ముఖాన వెలిగే తృప్తి విలువ గుర్తించ గలిగితే, మనిషిలో మనిషి*

“ఇదిగో, మిమ్మల్నే, చూడండీ!”

చిలకకొయ్యకు పైమీది కండువా తగిలిస్తూ ఆగి వెనక్కి తిరిగిచూశారు విశ్వనాథం మాస్టారు. ద్వారానికి ఆనుకుని భార్య పార్వతమ్మ నిల్చుని ఉంది. వెలిసిపోయిన నారచీర కట్టుకుని, చేతులకి రెండేసి గాజులతో నుదుటన పెద్ద కుంకుమబొట్టుతో నిల్చుని ఉంది.

“పిలిచావా, పార్వతీ?”

“అమ్మాయి ప్రయాణం ఎల్లుండేకదండీ?”

అవునని విశ్వనాథంగారికీ తెలుసు. అందుకే ఆవిడికి సమాధానం చెప్పలేదు.

పార్వతమ్మే మళ్ళీ అన్నారు: “దానికి. . . చీర. . . అదీ. . .”

“అవునవును. . .అదే ఆలోచిస్తున్నాను. . .” నిట్టూర్చి అన్నారు విశ్వనాథంమాస్టారు.

తమ పరిస్థితులనీ. . . భర్త మనసులోని బాధనీ గ్రహించగలిగినా. . . పార్వతమ్మకి పండగకి వచ్చిన కూతురు విశాలని అత్తవారింటికి పసుపు కుంకుమలతో చీర ఇచ్చి ఎట్లా పంపాలన్న ఆందోళన హెచ్చుగా ఉంది. అల్లుడుకూడా పండగకి వచ్చాడు. సెలవులేని కారణంవల్ల వెంటనే వెళ్ళిపోయాడు. అప్పుడెలాగో సంపాదించి అల్లుణ్ణి పంపగలిగేరు. తనకి చీర వెళ్ళేముందు కొని పెట్టవచ్చని అంది, తమ పుట్టింటి పరిస్థితులు బాగా అర్థం చేసుకోగలిగిన విశాల. మరి. . . మరి, ఇప్పుడెలాగ?

విశ్వనాథంగారినీ, పార్వతమ్మనీ గత వారం రోజులుగా కలవర పెడుతున్న సమస్య ఇది. నెలనెలా జాగ్రత్తపడి మిగిల్చినదేదో కొంత ఉంది. ఇంకా కనీసం ఓ నాలుగయిదు రూపాయలేనా ఉండాలి.

పెళ్ళిలో తమకు బహుమతిగా వచ్చిన వస్తువులలో ఒక వెండిగ్లాసుని దేనినయినా అమ్మి ఈ అవసరాన్ని గడుపుకుందామని పార్వతమ్మ భర్తతో అంది. మాస్టారు ఆవిడ ఆలోచన అంగీకరించలేకపోయారు.

పార్వతమ్మ మనస్సు చికాకుగా తయారయింది.

* * *

విశ్వనాథంగారు తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

విశాలని ఇప్పుడు పంపించాలంటే ఎంతలేదన్నా కనీసం నలభై రూపాయలేనా కావాలి. తన దగ్గర ముప్పైఅయిదు రూపాయల వరకూ ఉన్నాయి. ఆ కొరత ఈ కొద్ది వ్యవధిలో తీరటం ఎలా? అసంభవమే ననిపించిం దతనికి.

**పంతుల జోగారావు**

తనూ, పార్వతీ ఈ విషయం గురించి పడుతున్న ఆందోళన చూచి విశాల, ఈ పర్యాయం తనకి చీర కొనిపెట్టవద్దనీ, డబ్బు కూడినప్పుడే కొని పంపమనీ చెప్పింది. . . పిచ్చితల్లి! తను అలా చేస్తే ఏమీ అనుకోదు. అల్లుడుకూడా బుద్ధిమంతుడు. కాని. . . తనకే విశాల నలా పంపటం నచ్చలేదు.

పార్వతి చెప్పిన విధంగా చేయటం తప్ప మరో మార్గం లేదా! విశ్వనాథంగారికి దుఃఖం పొర్లుకు వస్తోంది. ‘ఛీ! ఛీ!’ అనుకున్నారు తమలో.

అప్పుడు. . .రాముడు గుర్తు వచ్చాడు. వాడొక్కడు మాత్రమే తనకింకా ట్యూషనుఫీజు ఇవ్వాలి. విశ్వనాథం గారి కసలు మొదట్లో ట్యూషన్లు చెప్పటమే ఇష్టం లేకపోయింది. కాని. . . తన పరిస్థితులు. . . తన అవసరాలు తన ఆశయాలని అణచివేసుకునేటట్లు చేశాయి.

నరసయ్య పరిస్థితి మాస్టారికి తెలియకపోలేదు. కాని అవసరం ఆయనలోని మంచితనాన్ని మటు మాయం చేస్తోంది. అడగక తప్పటం లేదు.

తీరా, అడిగితే ...

రాముడు జీతం ఆ రోజుకూడా తేలేదు!

మిగిలిన ఆ ఒక్క ఆశకూడా అణగారి పోయింది. విశ్వనాథంగారి మనస్సంతా చికాకుగా తయారయింది. ఆ కోపంలో రాముణ్ణి ఏవో అనేశారు. ఆ తరవాత వాణ్ణి ఎందుకన్నానా అని బాధ పడ్డారు.

రాముడు మాస్టారి మాటలతో కళ్ళలో నీళ్ళు కుక్కుకున్నాడు.


* * *

మనస్సు చికాకుగా ఉండటంచేత పాతపాఠమే ఆ రోజు మళ్ళీ చెప్పి పిల్లల్ని ఇళ్ళకి వదిలేశారు విశ్వనాథంగారు.

పిల్లలంతా వెళ్ళిపోయాక లేచి చొక్కా వేసుకుని వీధిలోనికి బయలుదేరారు. రకరకాల ఆలోచనలతో సతమతమవుతూ పరధ్యానంగా నడుస్తున్న విశ్వనాథం గారు అప్రయత్నంగా పక్కగా వస్తున్న బసవరాజుని చూశారు. ఆయన ఆ ఊళ్ళో పలుకుబడి కలిగిన ఓ పెద్ద వ్యాపారస్థుడు. కొంచెం చదువుకున్నవాడుకూడా. ఆయన కొడుకు లిద్దరు తన దగ్గిర ట్యూషను చెప్పించుకుంటున్నారు. విశ్వనాథంగారి పెదవుల మీద చిన్న నవ్వు మెదిలింది. బసవరాజును పలకరించ బోయారు. . . కాని. . .మాస్టారిని చూసికూడా చూడనట్లే నిర్లక్ష్యంగా ముందుకు సాగిపోయాడు బసవరాజు.

విశ్వనాథంగారికి తల తీసేసినట్లయింది. ఉస్సురు మని నిట్టూర్చారు. కిందిపెదవిని బలంగా కరుచుకుని వదిలారు. ఆయన ముఖం తెల్లగా పాలిపోయింది. ఆయనలో ఆలోచనలు సుడులు తిరిగాయి. . .

‘ఈ బసవరాజు కొడుకులకు ప్రైవేటు చెప్పటానికి మాత్రమే తను నియమింప బడ్డాడు. తన విధి అంతవరకు మాత్రమే! బసవరాజు విషయంలో తనకు అంతకన్నా గుర్తింపు లేదు! తనొక వ్యాపారసంస్థ... బసవరాజు నెలనెలా జీతం టంచనుగా పిల్లలద్వారా పంపుతున్నాడు. కాబట్టే వాళ్ళ మంచిచెడ్డలు తను చూచితీరాలి! తండ్రిగా ఆ బాధ్యత బసవరాజు వహిం చడు. . .



భద్రాద్రి ఆలయం కళ్యాణ మండపంలో

ఫోటో— వి. వి. రామకృష్ణారావు (గుడివాడ)

'తన పిల్లలు ఎలా చదువుతున్నదీ, వాళ్ళ పరిస్థితి ఎలా ఉన్నదీ ఈ బసవరాజు పంతుల్ని కనుక్కోవసరం లేదు. . . పంతులు యోగక్షేమాలు అంతకన్నా అతనికి అనవసరం. . .

'ఈ బసవరాజే రేపు పొద్దున్న తన గారాలబిడ్డడు నాలుగు నాలుగులు పధ్నాలుగవి చదివితే. . . అలా చదివినందుకు కొడుకుని నిందించడు! "ఎవడ్రా, మీ మాస్టారు?" అంటూ ఈ పంతులుకి నాలుగో ఎక్కం రాదనేటంత అహంభావంతో దూషిస్తాడు. . .

ఛీ! ఛీ! ఏం బ్రతుకయిపోయింది తనది?' విశ్వనాథం గారి కళ్ళలో నీళ్ళు చప్పున తిరిగాయి. బలవంతంగా రాబోతూన్న దుఃఖాన్ని బిగపట్టుకుని వెనక్కి తిరిగి ఇంటివేపు దారితీశారు.

దారిలో నరసయ్య కనిపించాడు. అంతదూరం నుంచే రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేశాడు. దగ్గిరికి వచ్చాక నవ్వుతూ "క్షేమంగా ఉన్నారా, పంతులుగారూ! మా వోడు ఎట్టా చదువుతున్నాడు. పదవకపోతే మాతరం సితకెయ్యండి. . . ఆడు సదువు బాగానే సదువుతాడనుకోండి. . .

"ఈ నెల డబ్బుకి కసింత ఇరకాటం వచ్చి పడినాది. . . మీరు మన్నించాల. . . పగలూ. . . రాతిరీ మీ కివ్వాల్సినదాన్ని గురించే ఆలోసిత్తుండాను. పిల్లకాయ భారమంతా మీది. నేను తండిరినే కానీ. . . సత్తెంగా ఆడికి తండిరీ. . . బగమంతుడూ మీరే కావాల! మీ జీతం వోరం రోజులలో ఇచ్చేస్తాను. . ."

"అబ్బే. . . దానికేమిటి, నరసయ్యా! నా కేమీ ఇబ్బంది లేదులే. . . నీ దగ్గిర ఉన్నప్పుడే పంపించు. రాముడి కేమిటి తక్కువ . . . బుద్ధిమంతుడు. అభివృద్ధిలోకి వస్తాడు తప్పక. . . జీతం గురించి నువ్వు బాధ పడకు." అప్రయత్నంగా అనేశారు విశ్వనాథంగారు. ఆ మాటలు తనకే ఆశ్చర్యాన్ని కలిగించాయి.

తనలో ఏ ఆలోచన. . . ఏ శక్తి తన నీ మాటలని అనేటట్లు చేసింది? క్షణంలో విశ్వనాథంగారికి సమాధానం దొరికిపోయింది!

ఆ మంచి నరసయ్యలో ఉంది.

ఆ శక్తి నరసయ్య మాటలలోని సహజతలో ఉంది!

దారి పక్కగా పోతూ చేతిలోని ఒక పైసా తృప్తిగా చూసుకుని మురిసిపోతున్నాడు ఓ బిచ్చగాడు! విశ్వనాథం గారికి తన నిజమయిన గుర్తింపు ఎక్కడ ఉందో అర్థమయిపోయింది. తృప్తిగా నిట్టూర్చారు. ఆయన మనసు తేలికపడినట్లయింది. ఆ సాయంత్రం ఒక వెండిగ్లాసు బజారులో అమ్మేశారు విశ్వనాథంగారు.

ఆ మరునాటి ఉదయం భయం భయంగా మాస్టారి ఇంట్లో అడుగు పెడుతున్న రాముణ్ణి పిలిచి ప్రేమగా అన్నారు విశ్వనాథంగారు: "రాముడూ! నేను నిన్న ఏదో అన్నానని మరేమీ బాధపడకు. . . నేను మీ నాన్నతో మాట్లాడేను. అతన్ని అడిగి బాధపెట్టకు. . . నా జీతం ఉన్నప్పుడే తెచ్చి ఇవ్వవచ్చు." విశ్వనాథంగారి కళ్ళు చిత్రంగా చెమ్మగిల్లాయి. గొంతు కొంచెం వణికింది.

విశ్వనాథంగారి మాటలు అర్థంకాక రాముడు వింతగా చూస్తూ నిలుచుండిపోయాడు! ★